# చిదంబర రహస్యం

టెంపోరావ్

హోటల్ తోటలో అశ్వద్ధామా, సురేఖా కుర్చీల్లో కూర్చున్నారు. బెంగుళూరులో వేసవికాలం హాయిగా వుంది. సూర్యుడు అస్తమించాడు. చల్లటిగాలి వీస్తోంది.

సిగరెట్ పొగవదుల్తూ అశ్వద్ధామ ఆలోచిస్తూ ఆకాశంవైపు చూస్తున్నాడు. హోటల్ నౌఖరు తెచ్చిన "ఈవెనింగ్ న్యూస్" దినపత్రికను సురేఖ చూస్తోంది.

ఏదో దినపత్రికలో చూసి ఆమె ఉలిక్కిపడింది.

"ఈ వార్త విన్నారా?" అందామె.

ఆమె కంఠం వినగానే మరో ప్రపంచంలోంచి హఠాత్తుగా భూమిమీద పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు. సురేఖ వైపు చూశాడతను.

"కోలారునుంచి వచ్చేటప్పుడు మనతో కూడా రైల్లో ఒక ఓల్డు లేడీ ప్రయాణం చేసింది. ఆమె జ్ఞాపకం వుందిగా?"

"ఆమెకేమయింది?" అడిగాడతను.

"బెంగుళూరు స్టేషన్‌లో దిగి యెక్కడికో వెళు తూండగా కారుకింద పడి ఆమె చచ్చిపోయింది."

మిస్ సురేఖ దినపత్రికలో ముద్రించిన ఫోటోను అతడికి చూపించింది. ఆశ్చర్యంగా అతను ఫోటోవైపు చూశాడు.

"రేఖా, స్టేషన్‌లో దిగిన మరుక్షణంలోనే కారు ప్రమాదంలో ఆమె మరణించడం విచిత్రంగా వుంది!"

"అదే నేనూ అనుకొంటున్నాను" అందామె.

అశ్వద్ధామ మెదడులో ఆ ముసలామె రూపం మెది లింది. ఆమె వయస్సు అరవై యేళ్ళుంటుంది. సగం పళ్లు వూడిపోయాయి. కోలార్‌లో ఆమె ట్రెయినెక్కింది. అతడికెదురుగా ఆమె కూర్చుంది.

"రోజులు మారాయి! రోజులు మారాయి!" అని తనలో తను గొణుక్కుంది.

అశ్వద్ధామ ఆమెను పలకరించాడు. కోలార్‌లో జరిగిన హత్యల్ని గురించి ఆమె చెప్పసాగింది.

"కోలార్‌లో హత్యలు విశేషంగా, విచిత్రంగా జరుగుతున్నాయి. గత నాలుగు నెలల్లోనూ నలుగురు చంపబడ్డారు. వాళ్లల్లో ఒక వ్యక్తి నిన్ననే మరణించాడు. అతను మా వూళ్ళో పేరుపొందిన డాక్టర్ రామ చంద్రన్. అతనంటే వూళ్ళోవాళ్ళందరికీ చాలా ఇష్టం. నిన్నరాత్రి అతను పొరపాటున నిద్రమాత్రలు ఎక్కువగా మింగి చనిపోయాడు. ఇంతకుముందు సుబ్బయ్య, వేదవతి, నర్సయ్య హత్యచేయబడ్డారు" అందామె.

అప్పట్లో ఆమె చెప్పినదంతా ఏదో కట్టుకథలా అతడికి అగుపించింది. వయస్సుమీరిన ముసలాళ్ళకు అంత ర్గతంగా ఏవో భయాలు వుంటూంటాయి. దానివలన

వాళ్ళు ప్రతి చిన్న విషయాన్నీ అనుమానంతో చూస్తారని అతడు అనుకున్నాడు.

ఓ నిమిషం తర్వాత ఆ ముసలామె యిలా అంది. ప్రపంచంలో పాపాలు ఎక్కువవుతున్నాయి. ఎప్పుడో అప్పుడు ఈ పాపాత్ములందరూ ఆ పరమాత్ముని ముందు శిక్ష పొందక తప్పదు. మా వూళ్లో జరిగిన ఈ హత్యలకు కారకులెవరో నాకు బాగా తెలుసు. నేను ఎంత చెప్పినా అక్కడి పోలీసువాళ్ళు పట్టించుకోరు. కట్టుకథలని తోసి పారేస్తారు. అందుకే బెంగుళూరు వెళ్తున్నాను. నాకు తెలిసినదంతా అక్కడి పోలీసువాళ్ళకు చెప్తే వాళ్లైనా కదులుతారని నా నమ్మకం" అందామె.

"ఏమిటంతగా ఆలోచిస్తున్నారు?" సురేఖ అడిగింది.

అశ్వద్ధామ చూపు ఆమెవైపు మళ్ళింది.

"రేఖా కోలార్‌లో జరిగిన హత్యలకు కారకులెవరో బెంగుళూరు పోలీసువాళ్ళకు చెప్పడం కోసం ఆమె ఇక్కడకు వస్తున్నట్లు మనతో అంది. ఆమె చెప్పింది నిజమైతే ఎవరో కావాలని ప్రమాదాన్ని సృష్టించి ఆమెను మరో లోకానికి పంపి వుండొచ్చు" అన్నాడతను.

"అలా జరిగే అవకాశం వుంది. అప్పట్లో ఆమె చెప్పింది నమ్మకపోయినా ఈ వార్త చదివాక నాకు అనుమానంగా వుంది. మనం దర్యాప్తు చేసి నిజం కనుక్కోవాలి" అందామె.

అశ్వద్ధామ మరో సిగరెట్ వెలిగించాడు. పొగ వదులూ ఆమెకేసి చూశాడు.

"బెంగుళూరులో వారంరోజులు విశ్రాంతి తీసుకుందామని ఇలా వచ్చాను. ఈ ముసలామె చావు మనకెదురైంది!"

"డోంట్ బాదర్! ఈ కేసు పూర్తయ్యాక వారం రోజులు విశ్రాంతి తీసుకోవచ్చు" అందామె.

అతడు హర్షించి లేచాడు.

"అయితే పద!" అన్నాడతను.

ఇద్దరూ సమీపంలో వున్న టాక్సీ స్టేండ్ వైపు నడిచారు.

ఇన్స్పెక్టర్ భట్ ముందుకొచ్చి అశ్వద్ధామ సురేఖలకు నమస్కరించి లోపలకు తీసుకువెళ్ళి కూర్చోమన్నాడు.

"మీరిలా రావడం నాకు ఆనందంగా వుంది. మీలాంటి పెద్దలు ఏదో కారణం లేకుండా రారు" అన్నాడు భట్.

అశ్వద్ధామ నవ్వాడు.

"ఇవాళ ప్రొద్దుట కారు ప్రమాదంలో ఒక ముసలామె మరణించిందని పేపర్లో చూశాను. దాన్ని గురించి మీరు ఏదేనా చెప్తారని యిలా వచ్చాను" అన్నాడు అశ్వద్ధామ.

ఇన్స్పెక్టర్ భట్ చప్పుడు చేస్తూ పైన తిరుగుతూన్న ఫాన్ వైపు చూసి విసుక్కున్నాడు.

"ఆమె ముసిల్ది, సార్. కళ్ళు బాగా కనబడవు అనుకుంటాను. బెంగుళూరు సిటీ స్టేషన్కి ఫర్లాంగు దూరంలో కారుకిందపడి ఆమె వెంటనే మరణించింది. కారు ఆగకుండా పోయింది. అక్కడకు వెళ్ళి దర్యాప్తు చేసి ఒకామె ద్వారా కారు నెంబర్ తెలుసుకున్నాం. ఆ కారు నంబరు KBX 0842. ఆ కారు కోలార్లో నివసించే ప్రఖ్యాత జమిందార్ చిదంబరంగారిదని కనుక్కున్నాం. ఆయన ప్రస్తుతం ఈ వూళ్ళోనే వున్నారు.

ఈ ప్రమాదం జరిగే సమయానికి చిదంబరంగారు రైలు స్టేషన్ సమీపంలో వున్న కింగ్స్ క్లబ్‌లో బసచేస్తున్నారు. ఆయన బయటకు వెళ్ళలేదనీ ఆయన కారు ఇగ్నిషన్ కీ జేబులోనే వుందనీ చివరకు తేలింది."

"చనిపోయిన ఆ ముసలామెదీ, జమిందారు చిదంబరం గారిదీ ఒకే వూరన్నమాట!" అన్నాడశ్వద్ధామ ఆశ్చర్యంతో.

"ఆమె కోలార్‌కి చెందిన వ్యక్తని మీకెలా తెలుసు?" అడిగాడు భట్.

"మీరెలా కనుక్కొన్నారో చెప్పండి."

"ఆమె చేతిలోంచి ఒక బాగ్ పక్కనే పడుంది. అందులో కొన్ని దుస్తులు, భగవద్గీత పుస్తకం వున్నాయి. పుస్తకంమీద మీనాక్షి, కోలార్ అని రాసి వుంది" అన్నాడు ఇన్స్‌పెక్టర్ భట్.

"ఆమె శత్రువులెవరైనా ఆమెను చంపడంకోసం ఈ కారు ప్రమాదాన్ని సృష్టించి వుండొచ్చుగా?"

ఇన్స్‌పెక్టర్ భట్ పరిహాసంగా నవ్వాడు.

"అలా జరిగివుంటుందని నేను అనుకోను సార్. పారుగూరునుంచి వచ్చిన ముసలామె మీదకు కారు తోలి చంపవలసిన అవుసరం ఈ లోకంలో ఎవరికుంటుంది?"

అశ్వద్ధామ లేచి నిలబడ్డాడు.

"కొన్ని సమయాల్లో మనం అనుకోని పనులెన్నో చేయవలసిన అవుసరం మనుషులకు వస్తూ వుంటుంది. ఇంతకీ ఆమె యీ వూరు ఎందుకు వచ్చిందో కనుక్కున్నారా?"

"ఇంకా దర్యాప్తు సాగుతోంది. ఇది సింపిల్ హిట్ అండ్ రన్ కేసు సార్!" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

అశ్వద్ధామ ఓసారి సురేఖవంక చూసి నవ్వాడు.

"మీకు కారు నంబరిచ్చిన ఆ స్త్రీ ఎవరు? ఆమె ఎక్కడ వుంటోంది?"

ఇన్స్పెక్టర్ భట్ తన డ్రాయర్ సొరుగులోంచి ఒక ఫైలును బయటకుతీసి, అది చూసి, కాయితంమీద అడ్రెసు రాసి అశ్వద్ధామకిచ్చాడు.

"థాంక్స్, ఇన్స్పెక్టర్!" అశ్వద్ధామ బయటకు నడిచాడు.

అతడిని సురేఖ వెంబడించింది. ఇద్దరూ కూర్చున్నాక టాక్సీ కదిలింది.

హాల్లోని ఎలక్ట్రిక్ దీపం కాంతిలో ఆమె మొహం మెరుస్తోంది. అశ్వద్ధామనీ, సురేఖనీ ఆమె పరకాయించి చూస్తూ, "దయచేసి కూర్చోండి" అంది. వాళ్ళిద్దరూ కూర్చున్నారు.

"మీ గురించి విన్నాను. నాలాంటి సామాన్య స్త్రీ ఇంటికి మీరు రావడం ఆనందంగానూ, మరోమూల ఆశ్చర్యంగాను వుంది" అందామె. అశ్వద్ధామ సిగరెట్ పొగను వూదుతూ ఆమె కళ్ళల్లోకి చూశాడు.

"రైల్వేస్టేషన్ సమీపంలో ఒక ముసలామె ప్రమాద వశాత్తూ ఏదో కారుకిందపడి మరణించింది. ఆ కారు నెంబరు మీరు చూశారుగా?"

"నిజం చెప్పాలంటే, ఆ కారు నెంబరు నేను చూడలేదు. నా వెనుకనుంచి ఎవరో ఆవిడ ముందుకొచ్చి ఆ నెంబరును గురించి నాతో చెప్పింది."

"ఏం చెప్పింది?"

"ఆగకుండా పోతోన్న ఆ కారు నెంబరు ఆమె చూసిందట. అది రోల్సురాయిస్ కారు. నెంబరు

KBX 0842. ఇది ఆమె నాకు చెప్పింది. తర్వాత పోలీసువాళ్ళు ప్రశ్నించగా, ఇది నేను వాళ్ళకి చెప్పాను."

"ఆమె మీతో యెందుకు చెప్పింది? మీరు అడిగారా?"

"లేదండి. రోడ్డుమీద పడున్న ఆ ముసలామె చుట్టూ చాలామంది పోగయ్యారు. అదేచోట కొంచెం దూరంగా నేను నిలబడ్డాను. తప్ప తాగి, రాకాసుల్లా కార్లను నడుపుతున్నారని వాపోతో, ఆమె ఆ కారుని గురించి చెప్పింది."

"ఆమెను మళ్ళీ చూస్తే పోల్చగలరా?"

"ఆమె ఎవరో నాకు తెలియదండి. ఇలా చెప్పి అలా మాయమయింది. పోల్చడం కష్టమే."

"ఆమె ఎలా వుంటుంది? వయస్సెంత?"

ఆమె నిస్సహాయంగా నవ్వింది.

"శీతలంగా వుండడంవల్ల మొహానికి మఫ్లర్ చుట్టుకుంది. అదే కాకుండా వీధి దీపాల మసక వెలుతుర్లో ఆమె వయస్సునీ, రూపురేఖలనీ నేను గుర్తించలేకపోయాను."

"మీరు మాకు చాలా సహాయపడ్డారు. కృతజ్ఞుడ్ని!" అంటూ అశ్వద్ధామ, సురేఖకి సౌజ్ఞ చేస్తూ, బయటకు నడిచాడు.

## 3

అశ్వద్ధామ, సురేఖ కోలార్‌లోని హోటల్ గదిలోకి అడుగుపెట్టగానే ముందరి హాల్లో వున్న గోడగడియారం పన్నెండు కొట్టింది.

సోఫాలో అశ్వద్ధామ వెల్లకిలా పడుకున్నాడు. అతని పెదిమల మధ్యనున్న సిగరెట్‌ను సురేఖ వెలిగించింది. ఆలోచిస్తూ అతడామె చెయ్యిని పట్టుకొని మెల్లిగా నిమిరాడు.

"రేఖా!"

"చెప్పండి."

"మల్లేశ్వరంలో మనం కలుసుకొన్న స్త్రీ చెప్పిన విషయం విచిత్రంగా వుంది. ఎక్కడినుంచో హఠాత్తుగా వచ్చి, ఆ మఫ్లర్ ధరించినామె ఈమెతో కారు నంబరు గురించి ఎందుకు చెప్పిందో తోచడంలేదు."

"దానిమీద మీరంతగా ఆలోచించనక్కర్లేదు. అనవసరమైన విషయాన్ని గురించి పక్క స్త్రీలతో మాట్లాడుతూ వుండడం మన దేశంలోని వాళ్ళకు అలవాటే!" అంది సురేఖ నవ్వుతూ.

"అంతే నంటావా?"

"దానిలో ఏదేనా వుందని మీరు భావిస్తున్నారా?"

అశ్వద్ధామ కళ్ళు మూసుకొన్నాడు.

"రేఖా, మొహానికి మఫ్లర్ చుట్టుకున్నామె నిజంగా కారు నెంబర్ను చూసిందనుకో! అయితే ఆమె పోలీసు వాళ్ళకి తనే స్వయంగా ఆ నెంబర్ను గురించి ఎందుకు చెప్పలేదు? ఇష్టంలేకా? ఇష్టం లేకపోతే ఆ విషయం మల్లేశ్వరంలో వుంటున్న స్త్రీకి ఆమె ఎందుకు చెప్పింది? దీనిలో వున్న విచిత్రాన్ని నువ్వు గుర్తించాలి. కారు నెంబరు చూడని స్త్రీ పోలీసు వాళ్ళకి ఆ నెంబర్ను అందించింది. కారు నెంబరు చూసిన స్త్రీ మాయమయింది. ఆమె ఎవరు? మరొకరికి నెంబరు చెప్పి పోలీసుల ముందుకు రాకుండా వుండవలసిన అవసరం ఆమెకెందు

కొచ్చింది? కారు కిందపడి మరణించిన ముసలామెతో ఆమెకు పరిచయముందా? ఈ ప్రశ్నలన్నింటికీ జవాబులు దొరికితే మనం నిజానికి దగ్గరవుతాం."

సురేఖ అతనివైపు కొంటెగా చూసి కనురెప్పలు చిట్లించింది. "మనం ఈ ప్రశ్నలు అడుగుతూ కూర్చుంటే హత్య చేసిన వ్యక్తి దొరక్కుండా పోవచ్చు" అందామె నవ్వుతూ.

అశ్వద్ధామ కళ్ళు తెరిచి గది నలువైపులా చూశాడు. ఓరగా తెరచి వున్న తలుపుల మధ్యనుంచి చల్లటిగాలి వీస్తోంది. లేచి గదిలో వున్న పరుపు దగ్గరకు నడిచాడతను. అలసటగా పరుపుమీద వాలాడు.

"రేఖా, ఏం చెయ్యవలసిందీ రేపు ఆలోచిద్దాం. కళ్ళు మూసుకుపోతున్నాయి!"

మిస్ సురేఖ తలుపులు మూసి గడియలు పెట్టింది. గదిలో వెలుగుతూన్న దీపాన్ని తీసేసి ఆమె తన పరుపు మీదకు దొర్లింది.

## 4

డాక్టర్ రామచంద్రన్ భార్య విచార వదనంతో కుర్చీలో కూర్చుంది. ఆమెను చూస్తూంటే అశ్వద్ధామ హృదయం జాలితో నిండింది.

"మీ భర్త అకస్మికంగా మరణించారని విన్నాను. దురదృష్టం" అన్నాడు అశ్వద్ధామ మెల్లిగా.

ఆమె జవాబివ్వలేకపోయింది. ఆమె కళ్ళు నీళ్ళతో నిండాయి. అతడామెవైపు జాలిగా చూశాడు.

"అదంతా ఎలా జరిగిందో చెప్పండి."

"రాత్రి ఏడు గంటలకి ఆయన ఒక రోగి యింటికి వెళ్ళి ఎనిమిదింటికి తిరిగి వచ్చారు. భోజనానికి

రమ్మన్నాను. ఆకలి లేదన్నారు. అప్పటిన్నూ, మత్తులో వున్నట్లు ఆయన గదిలో కెళ్ళి పడుకున్నారు. ఆయనకి విస్కీ తాగడం అలవాటు. ఎక్కడో విస్కీ అధికంగా తాగేవుంటారనుకొని, నేను నా పనులు పూర్తిచేసుకొని పిల్లలున్న గదిలోకెళ్ళి పడుకున్నాను. తెల్లారేమో చూద్దామని పొద్దుటే ఆయన గదిలోకెళ్ళాను. ఆయనింకా పడుకొనే వున్నారు. చలనంలేదు. భయంవేసింది. వెంటనే ఆయనతో కలిసి పనిచేస్తూన్న డాక్టర్ తంబుస్వామికి ఫోన్ చేశాను. అతను వచ్చాడు. ఆయన రాత్రే మరణించాడని అతను చెప్పాడు."

"ఆయన విస్కీ తీసుకొంటే మామూలుగా భోజనం మానేసేవారా?"

"నిజం చెప్పాలంటే విస్కీ తీసుకున్నాక ఆయనెక్కువగా తినేవారు."

"అయితే ఆ రాత్రి ఆయనెందుకు భోజనం చెయ్యలేదు?"

"ఎక్కడో తిన్నారేమో!"

అశ్వద్ధామ సిగరెట్ పొగను పీల్చి వదులుతూ తీవ్రంగా ఆలోచించసాగాడు.

"ఆ రోజు ఆయన ఎవరింటికి వెళ్ళారు?"

"దుర్గాదేవిగారింటికి."

"ఆమె ఎటువంటిది?"

"చాలా కాలంనుంచీ మావారు ఆమెకు డాక్టర్‌గా వుండేవారు. ఆమె మంచిదే. ఒకప్పుడు ఆమె తండ్రికి బాగా డబ్బు వుండేది. వున్నదంతా గుర్రప్పందాలలో పోగొట్టుకున్నాడు. అందువలన దుర్గాదేవి స్థితి మారింది."

"ఆమెకి పెళ్ళయిందా?"

"లేదండి. ఒకప్పుడు ఆమె జమిందారు చిదంబరాన్ని పెళ్ళాడుతుందని అందరూ అనుకొనేవారు. కాని ఎందు వలనో అది జరగలేదు. ఇంకా చిదంబరంమీదే ఆశలు పెట్టుకొని పెళ్ళిచేసుకోకుండా ఆమె వుండిపోయిందని వూళ్ళోవాళ్ళు అంటూంటారు."

"మీ భర్త పొరబాటున నిద్రమాత్రలు అధికంగా తీసుకోవడం మూలంగా మరణించారని పోలీసులు ఒప్పుకున్నారా?"

"అప్పుడప్పుడు నిద్రమాత్రలు వేసుకొనే అలవాటు ఆయనకుంది. ఎక్కువగా అవి మింగి ఆయన మరణించారని డాక్టర్ తంబుస్వామి పరీక్షమూలంగా తేలింది. ఆయన విస్కీ కూడా బాగా తాగారని డాక్టర్ అన్నాడు. విస్కీ సేవించాక తెలియని స్థితిలో నిద్ర మాత్రలు ఎక్కువగా మింగివుంటారని పోలీసులన్నారు."

"ఇంటికొచ్చాక ఆయన నిద్రమాత్రలు మింగడం మీరు చూశారా?"

"లేదండి. నేను నా పనుల్లో వున్నాను."

"డాక్టర్ తంబుస్వామి గురించి మీరు ఏం చెప్పగలరు?"

"ఆయన బతికుండగా అతడికంతగా ప్రాక్టీసులేదు. ఆయన పోయినప్పటినుంచీ అతడి ప్రాక్టీసు పెరిగింది. అతడు కోపిష్టి మనిషి. ధైర్యం, దీక్షా వున్నవాడు. అతడిని గురించి అంతకంటె నేను చెప్పలేను."

అశ్వద్ధామ ఆమెవైపు ఓ సారి చూసి మెల్లిగా బయటకు నడిచాడు.

# 5

ముందర హాల్లో సోఫాలో కూర్చుని జమిందార్ చిదంబరం ఆమెవంక ఆత్రంగా చూశాడు.

వయ్యారంగా నడుస్తూ ఆమె అతడి ముందుకొచ్చి నిలబడింది. రోజా రంగు జార్జట్ చీర, దానికి సరిపోయే జాకెట్. కోల మొహం. చెక్కిళ్ళమీద సొట్టలుపడి అదృశ్యమవుతున్నాయి. ఆమె కళ్ళు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. ఆమె శరీరం బంగారం రంగులో వుంది.

చిదంబరం ఆమె అందాన్ని చూసి ఆనందంతో పెదిమలు చప్పరించుకున్నాడు.

"మీకు సెక్రటరీ కావాలని విని యిలా వచ్చాను" అందామె.

"మంచి పనిచేశావు. నీ పేరూ, వూరూ చెప్పు!" అన్నాడతను.

"నేను పంజాబ్ నుంచి వస్తున్నాను. ఎవ్వరూలేని ఏకాకిని. పేరు ప్రేమ. ఏదో మంచి ఉద్యోగం దొరుకుతుందని యిక్కడికొచ్చాను."

"అమ్మాయి కూర్చో!" అని సోఫాను చూపించాడు వినయంగా. ఆమె కూర్చుంది.

"సెక్రటరీగా వుంటావా?"

"సంతోషంగా, సార్. నా సర్టిఫికేట్లు మీరు చూడొచ్చు!"

అతడు హుషారుగా నవ్వాడు.

"నిన్ను చూశాక నీ సర్టిఫికేట్లు చూడ్డం అనవసరం. ఇవాళనుంచే నా సెక్రటరీగా వుండు. నీ బస కూడా ఇక్కడే."

"థాంక్స్, సార్. నేను చెయ్యవలసిన పనులేమిటో

వివరించండి" అందామె.

"వెర్రిపిల్లా! నీ పనులన్నీ ఒకేసారి చెప్పాలంటే భారతం చదివి వినిపించినట్లు వుంటుంది. నువ్వు హాయిగా ఈ యింట్లో వుండు. చెయ్యవలసిన పనులు గురించి సమయానుకూలంగా నేను చెప్తాను."

"అలాగే, సార్" అని ఆమె లేవబోయింది.

"కూర్చో!" అన్నాడతను.

ఆమె కళ్ళలోకి చూస్తూ వుండిపోయాడతను. ఆమె తీయగా నవ్వి వూరుకుంది.

## 6

డాక్టర్ తంబుస్వామి వయసు ముప్ఫయిఏళ్ళుంటుంది. పొట్టిగా బలంగా, అందవిహీనంగా వుంటాడు. హృదయంలో ఏదో కోపాగ్ని రగులుతున్నట్లు అతడి కళ్ళు ఎర్రగా వుంటాయి.

అశ్వద్ధామను చూడగానే అతడు లోలోపల విసుక్కున్నాడు.

"ఎవరు మీరు? ఏం కావాలి?" అడిగాడతను.

అశ్వద్ధామ నవ్వుతూ అతడిని పరీక్షగా చూశాడు.

"మీకేం కావాలో త్వరగా చెప్పండి. కాలాన్ని వ్యర్ధపర్చడం నాకిష్టంలేదు. నాకోసం వందలాది రోగులు బయట కాచుకు కూర్చున్నారు."

"డాక్టర్ రామచంద్రన్ పోయాక మీకు ప్రాక్టీసు ఎక్కువైందని విన్నాను" అన్నాడు అశ్వద్ధామ.

తంబుస్వామి ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు.

"రామచంద్రన్ మరణానికీ, నా ప్రాక్టీసుకీ సంబంధం ఏముందో నాకర్ధంకావడంలేదు!"

అతడు చటుక్కున కుర్చీలోంచి లేచాడు. కోపంగా

అశ్వద్ధామవంక చూశాడు.

"మీ మాటలు అసహ్యంగా వున్నాయి. ఎక్కడి నుంచో వచ్చి యింత అమర్యాదగా, నీతి విహీనంగా నాతో మాట్లాడం నేను సహించను!"

"జీవితంలో జరిగే కొన్ని సంఘటనల్ని మనం సహించలేం!" అన్నాడు అశ్వద్ధామ, సిగరెట్ వెలిగిస్తూ.

తంబుస్వామి అమాంతంగా టేబుల్ మీదున్న బెల్ కొట్టబోయి, ఎందుకో మానుకున్నాడు.

"ఈ ముసుగులో గుద్దులాట ఎందుకు? మీకేం కావాలో చెప్పండి!"

"రామచంద్రన్ శవాన్ని మీరు పరీక్షించారా?"

"పరీక్షించాను. నిద్రమాత్రలు అధికంగా మింగి ఆయన నిద్రలోనే మరణించారు."

"ఆయన ఆత్మహత్య చేసుకున్నారా? ఆత్మహత్య చేసుకోడానికి కారణం ఏమిటి?"

"ఆ విషయాలన్నీ నాకంటె బాగా ఆయన భార్యకు తెలిసివుండాలి!"

"మీకు తెలిసిన విషయాలు చెప్పండి."

"రామచంద్రన్ గారి జీవితం సుఖంగా సాగేదికాదు. భార్యాభర్తల మధ్య ఏవో మనస్పర్థలు ఏర్పడ్డాయని నేను విన్నాను. బయటకు వాళ్ళు అన్యోన్యంగా కనబడినా, పులీమేకల్లా బ్రతికేవారు. దాని మూలంగా ఆత్మహత్య చేసుకోడానికి కారణముందో, లేదో మీరే వూహించుకోండి. ఆయన ప్రమాదవశాత్తూ మరణించారని పోలీసులు కూడా ఒప్పుకొన్నారు."

"స్లీపింగ్ పిల్స్ ఎక్కువగా తీసుకొంటే చస్తారని డాక్టర్ రామచంద్రన్ కి తెలియదంటారా?"

"డాక్టర్లందరికీ ఏది విషమో, ఏది అమృతమో తెలిసేవుంటుంది. కాని విస్కీ బాగా తాగడంవలన ఆయన తెలుసుకోనే సితిలో లేరు. ఆయనకు తాగుడు అలవాటు. డాక్టర్లు కూడా మనుషులేగా!"

"డాక్టర్లు కూడా మనుషులే. మనుషుల్లో వుండే నీచమైన ప్రవృత్తులన్నీ డాక్టర్లలో కూడా వుంటాయంటారు! అంతేనా?" అని అశ్వద్ధామ లేచి వడివడిగా బయటకు నడిచాడు.

టేబుల్ మీద తలవాల్చి డాక్టర్ తంబుస్వామి ఆలోచిస్తూ వుండిపోయాడు.

7

సుబ్బయ్య తండ్రి అశ్వద్ధామకి నమస్కరించి, కూర్చొన్నాడు. విచారంతో నిండిన కంఠంతో ఇలా అన్నాడు.

"వయస్సులో వున్న కుర్రాడండి. బాగా తాగుడు అలవాటైంది. ఆ రోజు చీకట్లో తప్పతాగి యింటికి పన్నూండగా కాలుజారి, చిన్న కాలువలోపడి చచ్చిపోయాడు."

"కాలవలో ఎలా పడ్డాడు?"

"మా చిన్న కాలవకి వంతెన లేదండి. తాటిమొండెం మీదనుంచి అందరూ కాలవ దాటుతూ వుంటారు. కాలవకి అవతలివైపున కల్లుపాకలున్నాయి. కల్లు తాగి చీకట్లో కాలవ దాటుతూంటే, వాడి కాలు జారి వుంటుంది. అమాంతంగా కాలవలోపడి, నీళ్ళు తాగి వూపిరాడక ప్రాణం కోల్పోయాడు."

రెండునిమిషాలపాటు అశ్వద్ధామ ఆలోచిస్తూ వుండిపోయాడు.

"ఆ తాటి మొండెంమీదుగా అతనికి కాలవ దాటడం అలవాటేగా?"

"అలవాటేనండి. కాని ఎంత అలవాటు న్నా, ఒక్కొక్కసారి ఆపదలు సంభవిస్తూనే వుంటాయి."

"మీ అబ్బాయికి పెళ్ళయిందా?"

"జమిందార్ చిదంబరంగారింట్లో పనిచేస్తూన్న వేదవతిని పెళ్ళాడతాననేవాడు. ఆ పిల్లకు కూడా మా అబ్బాయంటే చాలా యిష్టం. వాడికోసం, పాపం, తన ఉద్యోగాన్ని కూడా అది పోగొట్టుకొంది. కాని ఆమె కోర్కె ఫలించలేదు. అబ్బాయి మరణించాడు. వాడు పోయిన కొంతకాలానికి అది నిరాశతో అటకమీదనుంచి కిందపడి జీవితాన్ని ధ్వంసం చేసుకొంది."

"వేదవతి ఉద్యోగం ఎందుకు పోయింది?"

"చిదంబరంగారికి సుబ్బయ్య అంటే గిట్టదు. వాడిని పెళ్ళాడొద్దని ఆమెతో చెప్పారు. ఆమె వినలేదు. ఆయనకు కోపం వచ్చింది. ఇద్దరూ ముదెట్టుకొని చావండి, శవాలవ్వండి అని శపించి ఆయన వేదవతిని పొమ్మన్నారు."

"చిదంబరంగారు అన్నట్టే వాళ్ళు శవాలయ్యారు" అని అశ్వద్ధామ లేచాడు.

# 8

సేవాసదనం నడుపుతున్న దుర్గాదేవి గదిలోకొచ్చిన అశ్వద్ధామను చూసి నవ్వింది.

"దయచేయండి, కూర్చోండి!" అందామె.

కూర్చుని అతడామెవైపు క్షణకాలం చూశాడు.

"ఏం కావాలో చెప్పండి!"

"నర్సయ్య అనే అతను ఎలా మరణించాడో మీకు

తెలుసుగా?" అశ్వద్ధామ అడిగాడు.

"ఈ వూరు టౌన్ హాలు మీరు చూసేవుంటారు. రెండో అంతస్తులో వున్న కిటికీ వూచలు పట్టుకొని పక్కనున్న గోడకి అతడు రంగువేస్తున్నాడు. అక్కడి నుంచి తటాలునపడి మరణించాడు" అందామె.

"అతడికెవరైన శత్రువులున్నారా?"

"కూలిపనిచేసుకొని బతికేవారికి శత్రువులెవరుంటారు? కాని ఆ రోజు పొద్దుట ఒక సంఘటన జరిగింది. చిదంబరంగారికి వాడిమీద కోపం వచ్చింది. నేను ఆ సమయంలో అక్కడే వున్నాను. గొడ్డులా ప్రవర్తిస్తే చస్తావు అని చిదంబరంగారు వాడిని తిట్టారు. ఆ సాయంత్రం వాడు కిందపడి చచ్చాడు" అందామె.

డిటెక్టివ్ అశ్వద్ధామ ఆలోచిస్తూ సిగరెట్ వెలిగించాడు. ఏమిటీ చిదంబరం రహస్యం? చిదంబరానికి కోపం రాగానే ఆ వ్యక్తిని ఎవరు హతమారుస్తున్నారు?

ఆ వ్యక్తిని అతడే చంపుతున్నాడా? లేక డబ్బిచ్చి ఎవరిచేతనైనా చంపిస్తున్నాడా?

"బెంగుళూరు స్టేషన్ సమీపంలో కారుకిందపడి మరణించిన మీనాక్షి మీకు తెలుసా?"

"తెలుసు. పనీపాటాలేని ముసలిది. అందరి విషయాల్లోనూ జోక్యం చేసుకుని లోకం పాడయిపోతోందని బాధపడేది. అంతులేని చాదస్తం!"

"ఆమె బెంగుళూరు ఎందుకు వెళ్ళింది?"

"నాకు తెలియదు."

"ఆమె బెంగుళూరు వెళ్ళినప్పుడు యిక్కడినుంచి ఎవరైనా బెంగుళూరు వెళ్ళారా?"

"అనేకమంది వెళ్తూవుంటారు. అదే రోజున చిదంబరంగారు కారులో బెంగుళూరు వెళ్ళారు."

"మీరు బెంగుళూరు వెళ్ళలేదా?"

"నాకు యిక్కడి పనులతోనే సరిపోతోంది."

క్షణకాలం అతడు ఆలోచించాడు.

"చిదంబరంగార్ని మీరు ఎందుకు పెళ్ళాడలేదు?"

"ఆ విషయం అడక్కండి."

"చిదంబరంగారు అంతా చెప్పారు. అయినా మీరు చెప్పేదికూడా వినడం నా ధర్మం" అన్నాడు అశ్వద్ధామ ఆలోచిస్తూ.

"ఆయన మీకు ఏం చెప్పుంటారో నాకు తెలుసు. పంజరంలోని చిలకలను మెడ పిసికి నేను చంపానని ఆయన మీతో చెప్పుంటారు. అదంతా అబద్ధం. మీరు నమ్మకండి."

"నిజం చెప్పండి!"

"ఒక రోజున నేను యింట్లో లేనప్పుడు ఆయన వచ్చారు. నేను లేనని ఆయనకు కోపం వచ్చింది. నేను తిరిగి వచ్చాను. ఎక్కడికెళ్ళావు అని అడిగారాయన. నా చూపు పంజరంవైపు వెళ్ళింది. నేను ప్రేమతో పెంచుతున్న జంట చిలుకలు మెడలు విరిగి చచ్చి పడున్నాయి. ఆ చిలకలను చంపిన పిశాచానికి యిక నా హృదయంలో స్థానంలేదు. నేనాయనతో మాట్లాడకుండా లోపలకు వెళ్ళిపోయాను. ఇది ఆయన మార్చి చెప్తూ వుంటారు!"

తీవ్రంగా ఆలోచిస్తూ అశ్వద్ధామ బయటకు అడుగు వేశాడు.

సాయంత్రం హాయిగా వుంది. తెల్లటి మేఘాలు సోమరితనంగా ఆకాశంలో కదులుతున్నాయి. జమిందార్ చిదంబరం తోటలోని పూల మొక్కల పక్కన కుర్చీలో కూర్చుని ప్రకృతి సౌందర్యాన్ని చూసి నివ్వెరపోతున్నాడు. ఒకసారి తన ముందున్న పూలచెట్లకేసి తన చూపుని పోనిచ్చాడు. గులాబీ, బంతి, చామంతి, మల్లి, డాలియస్ — అనేక విధములయిన పూల సువాసనలు గాలిలో వ్యాపిస్తున్నాయి. హఠాత్తుగా అతని గుండె వేగంగా కొట్టుకోసాగింది. పూల మొక్కల పక్కనుంచి కాఫీ ట్రే చేత్తో పట్టుకొని, మిస్ ప్రేమ ఊర్వశిలా ఉద్రూతలూగిస్తూ దగ్గరకొస్తోంది. ప్రకృతి సౌందర్యమంతా ఆమెలో లీనమైనట్లు అతనికగుపించింది. ఆనంద డోలికల్లో ఊగుతూ తన చేతిలోని గులాబీ పువ్వును ఎత్తి వాసన చూశాడు. ప్రేమ కాఫీ ట్రేను బల్లమీద వుంచి, చిన్నగా నవ్వింది. చిదంబరం లేచాడు, ఊహాతీతమైన ఉద్రేకమేదో, అతని ప్రతీనరంలోనూ ప్రవహించి అతన్ని ఉప్పొంగిస్తోంది. తన చేతిలోని గులాబీ పువ్వును ఆమె జడలో పెట్టి, చిదంబరం బానిసలా ముకుళించి ఆమెముందు నిలబడిపోయాడు. చివరికి వణికే కంఠంతో ఈ మాటలు తొణుకుతూ బయటపడ్డాయి.

"ప్రేమా నువ్వంటే నాకెంత ఇష్టమో ఆకాశంలోని నక్షత్రాలనడిగితే నీకే తెలుస్తుంది! ఇంతకాలం ఒంటరిగా నీ కోసమే బ్రహ్మచారిగా కాచుకు కూర్చున్నానేమో అనిపిస్తోంది!"

"కాఫీ త్రాగండి" అని ప్రేమ మళ్లా చిన్నగా నవ్వింది. రెండు కప్పులలో కాఫీ కలిపింది.

"ప్రేమా, మనం వెంటనే వివాహం చేసుకుందాం. ఈ ప్రపంచంలో మీవాళ్లు ఎక్కడేనా వుంటే చెప్పు. వాళ్ళకి ఈ శుభవార్త టెలిగ్రాం ద్వారా తెలియ జేయిస్తాను."

"నాకెవ్వరూ లేరని ఇంతకుముందే చెప్పానుగా!" అంది ప్రేమ.

"నాకివ్వరూ లేరు, ఒక్క దుర్గాదేవి తప్పితే. ఆమెకూ, నాకూ ఏదో చుట్టరికం వున్నా, మా యిద్దరి మధ్యా భూమికీ సూర్యుడికీ మధ్య వున్నంత దూరంవుంది. ఏదీ, ఇలా చూడు, ప్రేమా, నన్ను పెళ్లాడుతావా?"

ఆ పేక్షిస్తూన్న అతని కళ్ళల్లోకి ప్రేమ కొంటెగా చూసింది. లావుగా, పొట్టిగా, ధనంతో మదమెక్కిన ఈ చిదంబరాన్ని తను పెళ్ళాడ్డమా! తనలో తను నవ్వు కుంది. ఆత్రంగా ఆమెని చిదంబరం చూస్తూ వుండి పోయాడు.

"నన్ను క్షమించండి. నేను మీ దగ్గర ఉద్యోగంలో నిన్ననే చేరాను. మీ హృదయాన్ని అర్థంచేసుకుంటే గాని నా హృదయాన్ని ఇవ్వలేను."

"ప్రేమా! నా హృదయాన్ని తనివితీరా అర్థంచేసుకో. అటుపైనే మన పెళ్ళి!"

మిస్ ప్రేమ కాఫీ కప్పును అతడికిచ్చింది.

"మన పెళ్ళి విషయం మాని కాఫీ తాగండి!" అందామె నవ్వుతూ.

అతడు గుటకలేస్తూ కాఫీ తాగాడు.

## 10

తోటలోని మాటలు విని ప్రేమ కిటికీగుండా కిందకు చూసింది. చిదరంబరం' స మీ ప ం లో వున్న కారు

డ్రయివర్ను తిడుతున్నాడు.

"బొత్తిగా బుద్ధి లేకుండా ప్రవర్తిస్తున్నావు. నా అనుమతిలేనిదే ఎవర్నీ నా కారులో ఎక్కనీయవద్దని నీకు వెయ్యిసార్లు చెప్పాను."

డ్రయివరు జవాబివ్వలేదు. చేతులు జోడించి నిలబడ్డాడు.

కోపంతో చిదంబరం డ్రయివర్ని కొట్టబోయాడు. అంతవరకూ వూరుకున్న డ్రయివర్ ముందుకు దూకి చిదంబరాన్ని బలంగా తోశాడు. గిర్రున తిరుగుతూ నేలమీదపడ్డాడు.

ఆగ్రహంతో అతడు డ్రయివర్ వంక చూశాడు.

"దొంగ వెధవా! ఎంత మొండి ధైర్యం! నామీద చెయ్యి వేస్తావా? నాకు కోపం తెప్పించినవాళ్ళ శవాలై నేలకూలారు. రాస్కెల్, ఫో! నువ్వు చేసిన పాపానికి ఘోరంగా చావు!" అర్చాడతను.

డ్రయివర్ వ్యంగ్యంగా చూస్తూ వెళ్ళిపోయాడు.

మిస్ ప్రేమ మెట్లుదిగి హాల్లోకి చేరుకుంది. చిదంబరం సోఫాలో కూర్చుని వున్నాడు.

"ఏం జరిగింది?" ఆమె అడిగింది.

"నువ్వు యింతవరకూ ఎక్కడ వున్నావు?"

"మేడమీద నా గదిలో వున్నాను. ఏదో గోల విని యిలా కిందకు పరుగెత్తుకొచ్చాను."

తనకు జరిగిన అవమానాన్ని ఆమె చూడలేదని అతడు సంతోషించాడు.

"ఏమీ లేదు ప్రేమా! డ్రయివర్ నిర్లక్ష్యంగా పని చేస్తున్నాడు. వాడికి బుద్ధి చెప్పాను."

"ఏవో కేకలు వినపడ్డాయి!"

"వాడు సణగడం ప్రారంభించాడు. నాకు కోపం హెచ్చింది. గట్టిగా అరిచి వాడి నోరు నొక్కేశాను. నాకు కోపంవస్తే తనకే ప్రమాదమని ఆ మూర్ఖుడికి తెలియదు!"

చిదంబరం ప్రేమ చెయ్యి పట్టుకొని దగ్గరగా లాక్కున్నాడు.

"ప్రేమా, పూర్వకాలంలో మన ఋషులు శపించేవారు. వాళ్లు శపించినట్లే అంతా జరుగుతూ వుండేది. నా జీవితాన్ని పరిశీలిస్తే ఋషుల శాపాలు ఒక అపారమైన దైవిక శక్తి వలన ఫలించేవనీ, ఆ శక్తి నాలో వుందనీ నీకే రుజువు అవుతుంది."

"చాలా విచిత్రంగా వుంది — నన్ను శపించకండి!"

చిదంబరం నవ్వాడు.

"నీకొక రహస్యం చెపుతున్నాను, విను. నాలో ఏదో వూహకందని దైవికశక్తి వుందనిపిస్తోంది. దానిమూలంగా నా శత్రువులు చీమల్లా నలిగిపోతున్నారు.

రామచంద్రన్ నన్ను ఎదిరించాడు. తర్వాత చచ్చిపోయాడు. సుబ్బయ్య, నర్సయ్య, వేదవతి స్మశానానికి తోవ తొక్కారు. నన్ను ఎదిరించిన ఈ డ్రయివర్‌గాడు బతుకుతాడా? రేపో మాపో చస్తాడు!" అన్నాడు చిదంబరం.

"కారుకిందపడి చచ్చిన ముసలామేనా వేదవతి?"

"ఆ ముసలిదాని పేరు మీనాక్షి. వేదవతి వేరు!"

"ఆ మీనాక్షి మీ శాపం మూలంగానే కారుకింద పడి చచ్చిందా?"

"మీనాక్షిని నేను శపించలేదు. ఆమె ఎందుకు మర

ణించిందో నాకు తెలియదు."

మిస్ ప్రేమ ఆలోచిస్తూ వుండిపోయింది.

* * *

మర్నాడు పొద్దుటే చిదంబరం, ప్రేమ హాల్లో కూర్చుని కాఫీ తాగుతున్నారు. నౌఖరు రంగయ్య హడా విడిగా లోపలకు వచ్చాడు.

"డ్రయివర్ రాత్రి చచ్చిపోయాడయ్యా!" అన్నాడు రంగయ్య.

నిర్ఘాంతపోతూ ప్రేమ చిదంబరం వంక చూసింది. చిదంబరం కళ్ళు నూతన కాంతితో మెరుస్తున్నాయి.

"మూర్ఖుడు నన్నె ఎదిరించాడు!" అన్నాడు చిదంబరం.

"అతడు ఎలా మరణించాడు?" ప్రేమ రంగయ్యని అడిగింది.

"అతడు రాత్రి సైకిల్ మీద ఇంటికిపోతున్నాడమ్మా. ఒకచోట రోడ్డు బాగుచేస్తున్నారు. అది చూడకుండా అతడు వెళ్ళుంటాడు. అతడు సైకిల్ తోసహా పక్కకు పడ్డాడు. ప్లీడర్ గారి కాంపౌండు చుట్టూ వున్న ముళ్ళ తీగలు అతనికి గుచ్చుకుపోయాయి. పొద్దుట చూసేసరికి చచ్చిపోయి పడున్నాడు" అన్నాడు రంగయ్య.

మిస్ ప్రేమ తటాలున లేచి గుమ్మంవైపు వెళ్ళబోయింది.

"ప్రేమా, ఎక్కడికి?" గద్దించాడు చిదంబరం.

"ఓసారి ఆ డ్రయివర్ని చూసి వస్తాను." అతడామె వైపు సూటిగా చూశాడు.

"శివుడు నాశనం చేసిన ప్రదేశంలో పార్వతి అడుగు

పెట్టడం మంచిది కాదు!" అన్నాడతను.

నవ్వుతూ ప్రేమ బయటకు వెళ్ళిపోయింది.

చిదంబరం కళ్ళుమూసుకొని జరిగినదాన్ని గురించి ఆలోచించసాగాడు.

# 11

హోటల్ గదిలో మిస్ సురేఖ కూర్చుంది. అశ్వద్ధామ ఆమె ముందు యిటూ, అటూ పచార్లు చేస్తున్నాడు.

"రేఖా, ఇంతవరకూ యీ చావులన్నిటికీ జమిందార్ చిదంబరమే కారకుడు అనిపించింది. కాని మనకు తెలిసిన దాన్నిబట్టి డ్రయివర్ చావుకు చిదంబరం కారకుడు కాదు. డ్రయివర్ ప్రమాదవశాత్తూ మరణించాడని అందరూ అనుకొంటున్నారు. ఇంతకుముందు కూడా యిలాగే అందరూ మరణించారు. ఈ చావుల వెనుక ఎవరి హస్తమో వుందని నా నమ్మకం!" అన్నాడతను.

"ఎవరో చేయకుండా ఏదీ జరగదు!" అందామె.

"నిజమే!" అని అతడు మళ్ళా పచార్లు చేయసాగాడు.

అతడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. కాని ఎంత ఆలోచించినా, తనలో తను ఎంత తర్కించుకున్నా ఏదీ పైకి తేలడంలేదు.

మిస్ సురేఖ మౌనంగా కూర్చుంది.

అశ్వద్ధామ సిగరెట్ పొగ పీల్చి వదుల్తూ ఆలోచిస్తున్నాడు. చటుక్కున అతడి మెదడులో ఏదో మెరిసింది. అతడు సురేఖ దగ్గరగా వెళ్ళాడు.

"రేఖా, అంతా బోధపడింది!" అన్నాడు.

అతను చెప్పినదంతా ఆమె విన్నది.

"మీరు చెప్పినదంతా విచిత్రంగా వుంది. అది రుజువు చేయడం కష్టం" అందామె.

"అంత కష్టంకాదు. మళ్ళా ఎప్పుడో చిదంబరానికి ఎవరిమీదో కోపం వస్తుంది. అతడి కోపానికి గురైన వ్యక్తిని మనం వెయ్యి కళ్ళతో చూడాలి. నాకు ప్రస్తుతం అర్థంకాని ఆ శక్తి స్వరూపం మన కళ్ళపడక తప్పదు."

అశ్వద్ధామ ఆమె చెయ్యిని మెల్లిగా నిమురుతూ, పక్కనే కూర్చున్నాడు.

## 12

మిస్ ప్రేమ తన పెట్టె బాగ్ పట్టుకొని హాల్లోకి వెళ్ళింది. జమిందార్ చిదంబరం బుద్ధ విగ్రహం ముందు నిలబడ్డాడు. చేతిలో వున్న కత్తిని వేలితో రాసి చూస్తున్నాడు.

అతడి చూపు ఆమెమీదకు వెళ్ళింది.

"ప్రేమా, అయితే నన్ను విడిచి వెళ్ళిపోడానికి నిశ్చయించావన్నమాట!" అన్నాడతను.

"నన్ను క్షమించండి. ఈ యింట్లో వుండాలంటే నాకు భయంగా వుంది. బయటకుపోవడం మంచిదని పిస్తోంది!"

"నీకు భయ మెందుకు? నా రెక్కలకింద వూపిరి పీల్చేవారికి అపాయాలు సంభవించవు. నాకు దూరమైతే అధోగతి పాలవుతావు!"

ప్రేమ దీనంగా అతడివైపు చూసింది.

"నన్ను మెల్లిగా వచ్చినట్లే పోనీయండి. నా గొడవ నేను చూసుకుంటాను."

చేతిలోని కత్తిని వేలితో రాస్తూ అతడు ఆమె

దగ్గరగా వచ్చాడు.

"ప్రేమా, నా హృదయాన్ని కవ్వించి, మైమరపించి పారిపోతావా? నాలో నువ్వు రగిలించిన జ్వాలలు ఎవర్నో కాల్చేస్తాయి!"

ప్రేమ పెదిమలు భయంతో వణికాయి. సామాగ్రితో ఆమె తొందరగా బయటకు పోయింది.

"ప్రేమా, ఆగు! అమృతంలాంటి నా హృదయాన్ని హాలాహలంగా మార్చిపోతున్నావు. నీకోసం చెప్తున్నాను. నాకు కోపం వస్తే నువ్వు మృత్యువుచేతుల్లో యిరుక్కుంటావు!"

చిదంబరం గుమ్మం బయటకు నడిచాడు. వరండా మీదున్న వ్యక్తివైపు ఆశ్చర్యంతో చూస్తూ వుండి పోయాడు.

"నువ్వెందుకిలా వచ్చావు?"

"సేవాసదనంకి విరాళం అడుగుదామని యిలా వచ్చాను" అంది దుర్గాదేవి.

ఓసారి ఆమె చూపు కాలుతున్న యినపకడ్డీలా అతడి మీదకు వెళ్ళింది. తన చేతిలోని కత్తిని తోటలోకి విసిరి అతడు మౌనంగా హాల్లోకి వెళ్ళిపోయాడు. దుర్గాదేవి ఆలోచిస్తూ బయటకు కదిలింది.

రోడ్డుమీద నిలబడివున్న ప్రేమ దగ్గరకు దుర్గాదేవి వెళ్ళింది. చేతిలో వున్న పెట్టెవైపు చూసింది.

"అమ్మాయి ఏమైంది? ఆయన పొమ్మన్నారా?"

"ఆయన పొమ్మనలేదు. నేనే పోతున్నాను" అంది ప్రేమ.

దుర్గాదేవి గంభీరంగా నవ్వింది.

"ఎందుకు పోతున్నావు?"

"ఈ ఊరంటే నాకు భయంగా వుంది. పొట్టకోసం యిలా వచ్చాను. ఇప్పుడు మారే ఊరైనా పోయి ఉద్యోగం చూసుకోడానికి నిశ్చయించుకున్నాను."

"వెర్రిదానా, చిదంబరానికి భయపడి పారిపోతావా? నీలాటి యువతులు ధైర్యంగా అటువంటివాళ్ళకు బుద్ధి చెప్పాలి! నువ్వు ఎక్కడకు వెళ్ళినా లోకంతీరు ఒకటే. నువ్వు నాతో వచ్చి నేను నడుపుతున్న సేవాసదనంలో పనిచేయి. దిక్కులేనివారి కోసం ఆ సేవాసదనం నేను స్థాపించాను. అక్కడ నీకు సుఖంగా వుంటుంది."

ప్రేమ సంశయిస్తూ వుండిపోయింది.

"పదమ్మాయి! ఏదేనా మంచి ఉద్యోగం దొరికాక నువ్వు వెళ్ళిపోవచ్చు. అంతవరకు నాతో సేవాసదనంలో వుండడం మంచిది."

ఇద్దరూ రోడ్డమ్మట నడవసాగారు.

జమిందారు చిదంబరం భవనం ఊరికి మారంగావుంది. ఇద్దరూ మెల్లిగా నడుస్తున్నారు. రోడ్డుకి యిటూ అటూ పెద్ద పెద్ద పొదలున్నాయి. ఆ సమయంలో అక్కడ జనసంచారంలేదు. ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు. ఏదో చప్పుడు విని దుర్గాదేవి వెనక్కితిరిగి చూసింది. ఒక వాన్ వేగంగా రోడ్డమ్మట వస్తోంది. దుర్గాదేవి ఓరగా ప్రేమవైపు చూసింది. ప్రేమ ఆమె చూపును గుర్తించలేదు.

వాన్ వేగంగా వస్తోంది. దుర్గాదేవి కళ్ళు అమాంతంగా ఎర్రబడ్డాయి. ఆమె హృదయంలో సముద్రాలు పొంగాయి. వాన్ దగ్గరకొస్తోంది. తటాలున ఆమె చెయ్యి కదిలింది. అమాంతంగా ప్రేమ రోడ్డు మధ్యనపడింది.

సడన్ బ్రేకుతో వాన్ ఆగింది. వాన్ ముందు బంపర్

ప్రేమ శరీరానికి కాస్త దూరంలో వుండగా డ్రయివర్ ఆపగల్గాడు.

అశ్వద్ధామ, ఇన్స్పెక్టర్ రామన్, ఆరుగురు కానిస్టేబుల్సు వాన్‌లోంచి కిందకు దూకారు.

రోడ్డుమధ్యన పడిన ప్రేమ లేచి నిలబడింది. అందరూ దుర్గాదేవిని చుట్టేశారు.

దుర్గాదేవి మొహంనిండా స్వేదబిందువులు నృత్యం చేస్తున్నాయి. లోకంలోని చీకటి, అవినీతి ఆమె కళ్ళలోంచి తొంగిచూస్తున్నాయి. జీవంలేని శిలావిగ్రహంలా ఆమె నిలబడిపోయింది.

"చిదంబరం శక్తి స్వరూపం!" అని గర్జిస్తూ అశ్వద్ధామ ప్రేమగా నటించిన సురేఖ దగ్గరకు నడిచాడు.

"రేఖా, యూం ఆర్ లక్కీ! సరైన సమయానికి రాగలనో లేనో అని నేను భయపడ్డాను" అన్నాడతను.

"ఆమె చేసేదంతా నేను మౌనంగా గమనిస్తూనే వున్నాను. హంతకురాలు!" అంది సురేఖ.

## 13

జమిందార్ చిదంబరం తోటలో వాళ్ళందరూ కూర్చుని టీ తాగుతున్నారు. అప్పటికి సూర్యుడు అస్తమించాడు. నలువైపుల నుంచీ చల్లటి గాలివీస్తోంది. పువ్వుల పరిమళం గాలిలో వ్యాపిస్తోంది.

ఇన్స్పెక్టర్ రామన్ ఓసారి చిదంబరంవైపు చూసి అశ్వద్ధామవైపు తిరిగాడు.

"మా పరిశోధన మొదటినుంచీ తప్పుతోవమ్మట వెళ్ళింది. ఇంతకుముందే నిజాన్ని మేం తెలుసుకొనివుంటే యిన్ని హత్యలు ఈ ఊళ్ళో జరిగేవిగావు. తలాతోకా తెలియనసి ఈ హత్యలకు దుర్గాదేవి కారకురాలని, ముజు

వులతో సహా అశ్వద్ధామగారు నిరూపించడం నేర పరిశోధనా లోకంలో శాశ్వతంగా కొనియాడబడు తుంది" అన్నాడు రామన్.

జమిందార్ చిదంబరం మిస్ సురేఖని సిగ్గుతో చూశాడు.

"అశ్వద్ధామగారూ, దుర్గాదేవి హంతకురాలని మీరు కనుక్కొని, నా పేరు ప్రతిష్టలు పోకుండా కాపాడారు. మీ సేవ నేనెన్నడు మరువలేను. ఈ సమయంలో ఈ కేసుకు సంబంధించిన పరిశోధనను గురించి విపులంగా చెప్తే సంతోషిస్తాం" అన్నాడు చిదంబరం.

స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్‌ను తీసి, అశ్వద్ధామ వెలిగించాడు. పొగపీలుస్తూ కుర్చీలో వెనక్కి వాలి, పక్కనే వున్న గులాబీ పువ్వును కోసి, దాన్ని కొంటెగా సురేఖ చేతికి అందించాడు. చిదంబరంవైపు చిలిపిగా చూసి నవ్వుతూ, సురేఖ గులాబీ పువ్వును తన జడలో పెట్టుకుంది. అశ్వద్ధామ తన ఠీవియైన కంఠంతో యిలా చెప్పసాగాడు.

"మొదట్లో ఈ హత్యలని గురించి నాకంతగా తెలీదు. హాయిగా బెంగుళూరులో ఒక మాసంపాటు వుందామని నేనూ, రేఖా ఆ వూరు వెళ్ళాం. ఒక రోజు కోలార్ వెళ్ళి అక్కడి బంగారు గనులను చూసి, మళ్ళా బెంగుళూరు వెళుతున్నాం. మాతో కూడా మీనాక్షి అనే ముసలామె ప్రయాణం చేసింది. ఆమెది మీ ఊరే; ఆమె మీ కందరికీ తెలిసిందే. ఈ ఊళ్లో హత్యలు విపరీతంగా జరుగుతున్నాయనీ, పోలీసువాళ్ళు వాటిని ఆపలేకపో తున్నారనీ ఆమె నాతో చెప్పుకుంది. కోలార్ పోలీసు వాళ్ళతో విసుగెత్తి, బెంగుళూరు పోలీసువాళ్ళకి

రిపోర్టు చేస్తే, వాళ్ళైనా ఏదైనా చేస్తారనే నమ్మకంతో ఆమె రైలులో వెళ్తోంది. బెంగుళూరు స్టేషన్లో దిగిన మరుక్షణంలో ఆమె కారు ప్రమాదంలో మరణించింది. ఆమె మూలంగానే ఈ హత్యల్ని గురించి నేను దర్యాప్తు చేయడం మొదలెట్టాను. నేను చేసినది డబ్బుకోసం కాదు, ప్రజల క్షేమం కోసం.

“ఇప్పుడు ఈ ఊర్లో జరిగిన హత్యల్ని గురించి ఆలోచిద్దాం. సుబ్బయ్య తాటి ముండెం మీదనుంచి కాలవ దాటుతూ జారిపడి చచ్చాడు. అతడు పోయిన కొన్ని రోజుల్లో అతడిని ప్రేమించిన వేదవతి ఊరగాయి జాడీల కోసం అటకెక్కి, జాడీలతో సహా కిందపడి మరణించింది. నర్సయ్య రెండో అంతస్తులో ఉన్న కిటికీ ఊచలను పట్టుకొని గోడకు రంగు పూస్తూ అమాంతంగా కిందపడి కళ్ళు మూశాడు. ఏ జబ్బూలేని డాక్టర్ రామచంద్రన్ నిద్రమాత్రలు ఎక్కువగా మింగి నిద్రలోనే మృత్యువును కౌగలించుకున్నాడు. వారి చావులకి కొన్ని రోజుల క్రిందట వాళ్ళందరికీ జమిందార్ చిదంబరంతో పోట్లాటలు జరిగాయి. చిదంబరం వాళ్ళను శపించాడు. కాని తార్కికంగా ఆలోచిస్తే కోపిష్టుల పాపాల మూలంగా సంఘం నాశనమవదు. చింతచెట్టుకింద కూర్చుని మంత్రాలు ఎంత పఠించినా చింతకాయలు రాలవు. రాయో కర్రో పెట్టి చింతకాయల్ని కొట్టి రాలేటట్టు చెయ్యాలి. ఇదే విధంగా ఈ హత్యలన్నింటినీ ఒక అమోఘమయిన బుర్ర రహస్యంగా ఊహించి నిర్వహించి వుండాలి. ఆ అమోఘమయిన బుర్ర యెవరిది? జమిందార్ చిదంబరంగారిదా? ఆయన కాకపోతే అంత మందిని చంపవలసిన అవసరమున్న వాళ్ళు మరెవరున్నారు?

ఈ రెండో ప్రశ్నకు జవాబుకోసం ఎంత ఆలోచించినా శూన్యంలో రెక్కలు కొట్టుకున్నట్లే అయింది. డాక్టర్ రామచంద్రన్‌ని చంపడానికి ఇంతో అంతో కారణం డాక్టర్ తంబుస్వామికుంది. అయితే ఆదే కారణం మూలంగా డాక్టర్ తంబుస్వామి సామాన్యులయిన సుబ్బయ్యనీ, వేదవతినీ, నర్సయ్యనీ చంపడం అసంభవం.

"ఈ హత్యలన్నింటినీబట్టి చూస్తే అందరూ చిదంబరాన్ని అనుమానిస్తారు. ఆయనకు అందరితోటీ పరిచయముంది. అందరిమీద ద్వేషముంది. కాని ఏ వ్యక్తినీ మొండిధైర్యంతో హత్య చేయవలసిన అవుసరం చిదంబరానికి లేదు. అయినప్పటికీ ఎందుకేనా మంచిదని ఒక రాత్రుల్లా చిదంబరాన్ని రేఖ కాపలాకాస్తూ కూచుంది. ఆ రోజు ఆయన డ్రయివర్‌ని తిట్టారు. ఆ రాత్రే సైకిల్ మీదనుంచి కిందపడి అతను మరణించాడు. రేఖ చూసిందాన్నిబట్టి జమిందార్ చిదంబరానికి ఆ హత్యతో ఎటువంటి సంబంధంలేదని తేలింది. అయితే డ్రయివర్ని ఎవరు హత్యచేశారు? తార్కికంగా ఎంత ఆలోచించినా ఈ ప్రశ్నకి జవాబు నాకు దొరకలేదు. ఈ ప్రశ్న మానవులు సహజంగా మెచ్చుకునే హేతువాదాన్ని వెక్కిరించింది.

"ఆ సమయంలో మెదడుతో ఆలోచించడం మానేశాను. నా మెదడును నిశ్శబ్దమయిన కదలికలేని స్థితిలో వుంచాను. మెదడుకి అతీతమయిన పై అంతస్థులోంచి ఏదైనా రావచ్చని భావించి కళ్ళు మూసుకుని సమాధి స్థితిలో చాలాసేపుండిపోయాను. అనుకున్నట్లే మెదడు పై అంతస్తులోంచి నూతన విజ్ఞానం మెరుపులా కిందకు దిగింది. ఆ మెరుపు కాంతిలో నిజాన్ని నేను

చూడగల్గాను.

"ఈ ఊళ్ళో జరిగిన హత్యల్ని గురించి ఒక్క విషయం మనం జ్ఞాపకం వుంచుకోవాలి. జమిందార్ చిదంబరం హంతకుడు కాకపోయినా ఆయన కోపానికి, ద్వేషానికి గురైన వ్యక్తులు హత్య చెయ్యబడ్డారు. హత్య చేస్తూన్న వ్యక్తిని పట్టుకోవాలంటే మరో హత్యకి అవకాశం కల్పించాలి. మళ్లా యెవరో చిదంబరంలో ద్వేషాన్ని, కోపాన్ని రెచ్చగొట్టాలి. సురేఖ ప్రేమ పేరుతో చిదంబరం ద్వేషానికి గురయింది. దుర్గాదేవి వరండాలో నిల్చుని ప్రేమకీ, జమిందార్ కీ మధ్య జరిగిన సంభాషణ పూర్తిగా విన్నది. తరవాత సానుభూతి నటిస్తూ తన సేవాసదనంలో పని చెయ్యమని ఆమె ప్రేమకు చెప్పింది. మా ప్లాన్ ప్రకారం ప్రేమతో ఆమె వెళ్ళింది. జనసంచారంలేని కొండ ప్రదేశం. వాళ్ళిద్దరూ రోడ్డమ్మట వెళుతున్నారు. వారి వెనకనే నేను పోలీసులతో వానులో బయల్దేరాను. హఠాత్తుగా దుర్గాదేవి రోడ్డు మధ్యకు ప్రేమను తోసింది. అదే క్షణంలో సడన్ బ్రేక్ తో వేన్ను ఆపి ఏ అపాయమూ లేకుండా నేను చూశాను. వాన్ లోంచి కిందకు దూకాను. రోడ్డుపక్క పొదలముందు దుర్గాదేవి స్తంభంలా నిలబడివుంది. ఆమె మొహంనిండా స్వేదబిందువులు నాట్యం చేస్తున్నాయి. ఆమె కళ్ళల్లోకి చూసేసరికి, ఆమె కనురెప్పల వెనుక ఏదో ప్రళయం నాకు కనిపించింది. మానవులను నాశనం చేసే పిశాచం ఆమెలో దాక్కున్నట్లు నాకు అనిపించింది.

డిటెక్టివ్ అశ్వద్ధామ క్షణకాలం కళ్ళు మూసుకున్నాడు. నీలాకాశం నిర్మలంగా వుంది. జమిందార్ చిదంబరం అశ్వద్ధామవైపు చూశాడు.

"అశ్వద్థామగారూ, నేను ఎంత మూర్ఖుడ్నో ఇప్పుడు బోధపడింది. ఇంతవరకూ ఏదో శక్తి స్వరూపం నన్ను కాపాడుతోందనీ, నేను కోప్పడ్డవాళ్ళను శిక్షిస్తోందనీ అనుకునే వాడిని. చివరికి అదంతా చేసింది దుర్గాదేవని ఇప్పుడే నాకు తెలిసింది. ఇన్ని హత్యలు ఆమె ఎందుకు చేసిందో ఊహించలేకుండా వున్నాను" అన్నాడు చిరంబరం.

అశ్వద్థామ గంభీరంగా నవ్వాడు.

"దుర్గాదేవి మీకు దగ్గర బంధువు. ఆమె మిమ్మల్ని విపరీతంగా ప్రేమించింది. కాని మీరు ఎందువల్లనో ఆమెను పెళ్ళాడలేదు. ఆమె ప్రేమ ఫలించలేదు. చివరికి ఆమె ప్రేమ ద్వేషంగా మారింది. ఆమె ప్రేమతో పెంచిన జంట చిలకలు ఆమె హృదయంలో చెలరేగిన ద్వేషానికి బలయినాయి. అటుపైన చాలా తెలివిగా హత్యలు చేయడం ప్రారంభించింది. మీరు ద్వేషించిన వ్యక్తిని ఆమె చంపుతూ వుండేది. దీనిమూలంగా పోలీసుల అనుమానాలు మీమీదకు వెళ్తాయనీ, మీ రెప్పుడో ఒకప్పుడు అపకీర్తితో ఉరికంబానికి గురవుతారనీ ఆమె ఆశించింది. అందుకే ఈ హత్యలన్నీ జరిగాయి. ఈ హత్యలమూలంగా దుర్గాదేవికి ఏమీరాలేదు. ఏదో వసుందని ఆమె ఆశించలేదు. వీటిమూలంగా మిమ్మల్ని పీడించి, బాధించాలని ఆమె తాపత్రయపడింది."

"అశ్వద్థామగారూ, మీరు చెప్పింది వింటూంటే భయంకరంగా వుంది. బెంగుళూరులో చనిపోయిన మీనాక్షిని నేను కోప్పడలేదు. ఆమెను ఎవరు చంపి వుంటారు?" చిదంబరం అడిగాడు.

"మీనాక్షి మీదకు కారును తోలి ఆమెను దుర్గాదేవే

చంపింది. ఆ సమయంలో మీరు బెంగుళూరులో నే వున్నారు. మీ కారు నంబరును ఒక స్త్రీ అక్కడి పోలీసువాళ్ళకి అందించింది. ముఖానికి మఫ్లర్ చుట్టుకొని కారు నంబరు చెప్పిన స్త్రీ దుర్గాదేవి అయుండాలి. అయితే దుర్గాదేవి మీ నాక్షీ నెందుకు చంపింది. మీ నాక్షీ ముసల్ది. ఆమె ఎలాగో దుర్గాదేవి రహస్యాన్ని గురించి తెలుసుకుంది. ఆ విషయాన్ని పోలీసులతో చెప్పడం కోసం బెంగుళూరు వెళ్ళింది. ఆమె పోలీసు స్టేషన్ కి వెళ్ళేలోపలే దుర్గాదేవా మెను హతమార్చింది. సమీపంలో వున్న ఒక స్త్రీకి మీ కారు నంబరిచ్చి దుర్గాదేవి మాయమయింది."

చీకటిపడింది. చిదంబరం కోరికమీద తోటలోని లైట్లన్నీ వెలిగాయి.

"అశ్వద్ధామగారూ, యిప్పుడంతా అర్థమయింది. మీరందరూ ఈ రాత్రి యిక్కడే భోజనాలు చెయ్యాలి. భోజనాలయ్యాక నా కోల్స్ రాయిస్ కారులో బెంగుళూరు వెళ్ళొచ్చు" అన్నాడు చిదంబరం.

డిటెక్టివ్ అశ్వద్ధామ నవ్వుతూ సురేఖవైపు తిరిగి ఆమె చేతిని మెల్లిగా నిమిరాడు.

—:ఐపోయింది:—